25న అన్నమయ్య జయంతి



అన్నమయ్య కీర్తనలు ప్రాక్టీస్ చేస్తున్న శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమి విద్యార్థులు

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25న అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి చెప్పారు. ఆదివారం నల్లకుంటలో అకాడమి విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వసుధామూర్తి జయంతి ఉత్సవాల వివరాలు వెల్లడించారు. మాదాపూర్‌లోని శిల్పారామం అంబి థియేటర్‌లో సాయంత్రం 5 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ముఖ్య అతిథిగా ప్రముఖనటుడు, మోటివేషనల్ స్పీకర్ కేవీ ప్రదీప్‌రావు, యాంకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ సరస్వతి ప్రదీప్, ప్రముఖనర్తకి, నటి ఆశ్రిత వేముగంటి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతిభట్ల హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా వినూత్న రీతిలో 100 మంది సంగీత, నృత్య కళాకారులతో 'సామూహిక సంకీర్తన'నృత్యరూపకం ఉంటుందన్నారు. డాక్టర్ కనక హర్షిణి, శాలిని అమరనేని కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో నిర్వహించే ఈ వేడుకలకు వర్ధమాన గాయనీ నందిని, కీ బోర్డ్ ప్లేయర్ యామిని ఈవెంట్ మేనేజర్లుగా వ్యవహరిస్తారని వసుధామూర్తి వివరించారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

కాచిగూడ: ఆర్టీసీ బస్ ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బస్‌షెల్టర్ల నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. వరంగల్ జాతీయ రహదారి మార్గంలో ఉన్న కాచిగూడ పరిధిలోని సుందర్‌నగర్ బస్‌షెల్టర్ ముందు ఆటోల అక్రమ పార్కింగ్, షెల్టర్ లోపల అపరిశుభ్రం, దానిముందు మురుగునీరు నిలిచి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సుందర్‌నగర్ బస్‌షెల్టర్ వద్ద నుంచే కాచిగూడ రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు వస్తూ, పోతూ ఉంటారు. నిత్యం ఇక్కడి నుంచి వందలాది మంది ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు ఊడా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో బస్‌షెల్టర్ లోపల కూర్చోడానికి వీలులేక, రోడ్డుపై నిల్చోడానికి వీలు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు అక్కడే చెట్లకింద, రోడ్డుపై నిలిచి ఉండాల్సి వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే బస్సు షెల్టర్లు నిరుపయోగంగా మారుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం ఉన్న బస్‌షెల్టర్లను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. లేకపోతే లక్షల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారే పరిస్థితులు ఉన్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాచిగూడ సుందర్‌నగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న బస్‌షెల్టర్

శాంతారామ్ అవార్డు గ్రహీతకు సన్మానం



రాగిణికి జ్ఞాపిక అందజేస్తున్న పోపూరి శ్రీనివాస శర్మ

నల్లకుంట: సెయింట్ మేరీస్ కాలేజీలో బీఏ పూర్తి చేసుకున్న బాగ్ అంబర్‌పేట సీతా కాలనీవాసి బెల్లారి రాగిణి బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డుతోపాటు ఎంఆర్ శాంతారామ్ అవార్డు అందుకున్నారు. ఈ విద్యార్థిని స్థానిక సిండికేట్ బ్యాంక్ సమీపంలో గల శ్రీ సరస్వతి సంగీత విద్యాలయంలో కర్ణాటక సంగీతంలో శిక్షణ పొందుతున్నారు. ఆదివారం సంగీత విద్యాలయంలో రాగిణిని ప్రిన్సిపాల్, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాసశర్మ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగీత శిక్షకులు యశస్విని, తేశస్వినిలు పాల్గొన్నారు.

శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త



మాట్లాడుతున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వర్‌రావు, జనార్ధనమూర్తి ఎస్పీ భారతి, మల్లాది ఉష, బండి శ్రీనివాస్

చిక్కడపల్లి: ప్రతి జీవిలోనూ దైవత్వాన్ని దర్శించిన ఆది శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో ఆదివారం శ్రీ త్యాగరాయ గానసభలోని కళావెంకట దీక్షితులు కళావేదికపై శంకరాచార్య సంస్మరణ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల వయసులోనే సన్యాసం స్వీకరించి వేదాలకు భాష్యాలు చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్పీ భారతి, సంగీత గురువు మల్లాది ఉష, గానసభ పాలకవర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ ద్రావిడ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్‌వీకే) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు మధుమేహం, బీపీ, నేత్ర, రక్త పరీక్షలను నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు ఉచితంగా మందులతోపాటు కంటి అద్దాలను అందజేశారు. లక్ష్మిదాస్ డయగ్నాస్టిక్ సెంటర్ ప్రతినిధి గంధం బాలరాజ్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ డయాబలాసిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడటానికి స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి వినయ్‌కుమార్, ప్రముఖ వైద్యులు కులశేఖర్, కేవీఎస్ నారాయణ, డాక్టర్ శ్రీవర్ధన్, డాక్టర్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ నేతలను కోర్టులో హాజరుపర్చాలి

ముషీరాబాద్: వరంగల్ జిల్లా పోలీసులు 18వ తేదీ రాత్రి వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం అరెపల్లి గ్రామ సమీపంలో అరెస్టు చేసిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీకి చెందిన అజ్ఞాత దళ నాయకులు ఆబర్ల రాజన్న, సిద్ధబోయిన జీవన్, దేవిరెడ్డితోపాటు మరొకరిని వెంటనే కోర్టులో హాజరుపరచాలని, ఆ పార్టీ వరంగల్ జిల్లానేతలు నున్న అప్పారావు, ఆరెల్లి కృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సరళ డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన విషయాన్ని బయటకు తెలియకుండా పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు గ్రామాలలో కూంబింగ్ నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వెంటనే కూంబింగ్‌ను నిలిపివేయాలని అన్నారు. ఆ నాయకుల అరెస్టును న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్ రావు మరో ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

వీరభద్రరావు ఆదర్శ పాత్రికేయుడు



రమణను సన్మానిస్తున్న జనార్ధనమూర్తి, రాజేంద్రప్రసాద్, రామచంద్రరావు

చిక్కడపల్లి: నమ్మిన సిద్ధాంతాల మేరకు అనేక వ్యాసాలు రాసి ప్రజలను చైతన్యపరచిన మాదాల వీరభద్రరావు ఆదర్శ పాత్రికేయుడని గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో వీరభద్రరావు స్మారక సమితి, సాధన సాహితీ స్రవంతి, మానస ఆర్ట్స్ థియేటర్స్, త్యాగరాయగానసభల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మాదాల వీరభద్రరావు జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీరభద్రరావు స్వాతంత్ర్య ఉద్యమంతోపాటు ఆంధ్రరాష్ట్ర సాధన పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ పాత్రికేయుడు రాయప్రోలు రమణకు ప్రదానం చేశారు. ప్రముఖులు రాజేంద్రప్రసాద్, రామచంద్రరావు, శివశంకర్, రఘుశ్రీ పాల్గొన్నారు.

బీజేపీ నేతకు కిషన్‌రెడ్డి పరామర్శ



లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న కిషన్‌రెడ్డి



నామం రాజును పరామర్శిస్తున్న కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ నేత దాడిలో గాయపడిన బీజేపీ సీనియర్ నేత లక్ష్మణ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మనగర్‌లోని బాధితుడి నివాసానికి కిషన్ రెడ్డి వెళ్లారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజు ఓ బీఆర్‌ఎస్ నాయకుడు కులం పేరుతో దూషించి, అకారణంగా దాడి చేశాడని, ముక్కు దెబ్బతిన్నదని లక్ష్మణ్ తెలిపారు. కిషన్‌రెడ్డి వెంటనే వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. దాడి చేసినవారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు పూస రాజు, రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.విశ్వం, నందగిరి నర్సింహ్మ, అశోక్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రవి కుమార్, నాయకులు సత్యనారాయణ, ప్రభాకర్, గడ్డం నవీన్, శివ, నరేష్, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నల్లకుంట: లోక్‌సభ ఎన్నికల ముందు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన నల్లకుంటకు చెందిన బీజేపీ కార్యకర్త నామం రాజును ఆయన నివాసంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన కోలుకుని ఇటీవలే ఇంటికి వచ్చారు. కేంద్రమంత్రితోపాటు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, కార్పొరేటర్ అమృత, డివిజన్ బీజేపీ నాయకులు ఉన్నారు.

భర్త వద్దకని బయలుదేరిన మహిళ అదృశ్యం



జ్యోతి(ఫైల్)

నల్లకుంట: ఇద్దరు పిల్లలను తన తల్లి వద్ద వదిలిపెట్టి భర్త వద్దకు బయలుదేరిన ఓ ఇల్లాలు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కె.రమాదేవి తెలిపిన వివరాలు.. విజయవాడకు చెందిన కంద్రకొండ రవి, జ్యోతి(23) దంపతులకు అర్జున్(5), కార్తిక్(4) సంతానం. ఆ దంపతులు జీవనోపాధి కోసం నగరానికి వచ్చారు. శంకరమఠం పద్మకాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌ఉమెన్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి, భర్త, పిల్లలతో కలిసి అక్కడే ఉంటోంది. ఈ క్రమంలో విజయవాడలో ఇంటినిర్మాణం చేపట్టిన రవి ఈ నెల 1న అక్కడికి వెళ్లాడు. ఈ నెల 18న జ్యోతి ఇద్దరు కుమారులను సమీపంలోనే నివాసముంటున్న తన తల్లి బొజ్జ నాగమణి ఇంట్లో వదిలి వచ్చింది. రాత్రి 8.30 గంటల సమయంలో తల్లి ఫోన్ చేయగా ట్రెయిన్‌లో ఉన్నానని, విజయవాడలో ఉన్న భర్త వద్దకు వెళుతున్నానని జ్యోతి చెప్పింది. తిరిగి రాత్రి 10 గంటలకు నాగమణి మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని రావడంతో వెంటనే విషయాన్ని అల్లుడికి, తన భర్తకు చెప్పింది. ఆదివారం ఉదయం 5 గంటలకు నాగమణికి భర్త, అల్లుడు ఫోన్ చేసి జ్యోతి విజయవాడకు రాలేదని చెప్పారు. దీంతో నాగమణి తెలిసినవారిని, బంధువులను ఆరా తీసినప్పటికీ కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో కుమార్తె కనిపించడం లేదంటూ ఆదివారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన భారీచెట్టు.. తప్పిన ప్రమాదం



మోహన్‌నగర్‌లో కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని మోహన్‌నగర్‌లో ఆదివారం భారీ వేప చెట్టు కూలింది. చెట్టు కొమ్మలు ఇంటి ప్రహరీపై పడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూలిన కొమ్మలను యంత్రాల సహాయంతో తొలగించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని శ్రీధర్‌రెడ్డి కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘననివాళి



సుందరయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వాకర్స్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గొప్ప ఆదర్శ ప్రజానేత పుచ్చలపల్లి సుందరయ్య అని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఆర్.వివేక్ అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ప్రముఖ పార్లమెంటేరియన్, కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్కు ప్రధాన కార్యదర్శి బి.వెంకటస్వామిగౌడ్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రాఘవరెడ్డి, కోట రమేష్, తీగల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

భజన సంప్రదాయానికి అన్నమాచార్యులు ఆద్యుడు




సన్మాన గ్రహీతలతో రాము, శ్రీమణి, సీఐ సీతయ్య, అంజిబాబు, నాగేందర్, కృష్ణ, మధుమతి, మోహన్

చిక్కడపల్లి: భజన సంప్రదాయం, పదకవితా శైలికి తాళ్లపాక అన్నమాచార్యులు ఆద్యుడని వక్తలు కొనియాడారు. శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో అన్నమాచార్యులు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'సంగీత నాట్య నీరాజనం'శీర్షికతో కళాకారులు పలు సంగీత, నృత్యాంశాలను ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎంకే రాము, శ్రీమణి, చిక్కడపల్లి సీఐ ఎ.సీతయ్య, పండిట్ అంజిబాబు, దామోదరం నాగేందర్, జి.కృష్ణ, మధుమతి, నారోజు మోహన్, అంజన్ సాయివర్మ, సుధారాణి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సుదర్శన్ 35ఎంఎం, దేవి థియేటర్‌ల ప్రాంగణంలో ఆదివారంరాత్రి సినీహీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం బర్త్‌డే కాగా, ఒకరోజు ముందుగానే సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా రంగురంగుల విద్యుత్ దీపాలు, డీజేలు ఎన్టీఆర్ చిత్రాల్లోని పాటలతో అభిమానులు సందడి చేశారు. ఎన్టీఆర్ నటించిన దేవర సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్‌తోపాటు థియేటర్ మేనేజింగ్ బాల్‌గోవిందరాజు, మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతోనే మానసిక బానిసత్వం



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న రమేష్ తదితరులు

ముషీరాబాద్: సమాజంలో మూఢనమ్మకాలు ఎంత ఎక్కువగా ఉంటే అది అంత మానసిక బానిసత్వంలో మగ్గుతుందని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకుడు రమేష్ అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యా, వైజ్ఞానిక తరగతులు జరిగాయి. 'మూఢనమ్మకాలు–సైన్స్'అనే అంశంపై రమేష్ మాట్లాడుతూ సైన్స్ వల్లే మానవ పురోగతి సాధ్యమన్నారు. మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.అన్మేష్ పరిణామక్రమం అనే అంశంపై మాట్లాడుతూ జీవ పరిణామ క్రమంలో మనిషి ఈ దశకు చేరుకోవడానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టిందని, కొందరు దోపిడి కోసం కులం, మతం పేరిట వైషమ్యాలు సృష్టిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ నేత ఎస్.నాగేశ్వర్‌రావు, పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవికుమార్, బి.ఎస్.కృష్ణ, ఉపాధ్యక్షులు కిరణ్, మల్లేష్, సహాయ కార్యదర్శులు బంగారి శ్రీనివాస్, ఎల్లప్ప, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆటకట్టించేందుకు సిటీ పోలీస్ యాక్ట్

- పబ్లిక్‌లో న్యూసెన్స్ క్రియేట్ చేస్తే నేరుగా జైలుకే ..
- ఒక్కరోజు జైలుకెళ్లినా రికార్డుల్లో నమోదు
- 104 మందికి జైలు, మిగిలిన వారికి జరిమానా

చిలకలగూడ : ముషీరాబాద్ పఠాన్‌బస్తీకి చెందిన మహ్మద్‌జకీర్ గత కొంతకాలంగా ప్రతినిత్యం పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడు. బస్తీల్లో వీరంగం చేస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. సీపీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. 60 రోజులు జైలుశిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి జారీచేసిన ఆదేశాల మేరకు మహ్మద్ జకీర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

- పద్మారావునగర్‌కు చెందిన ఓ మహిళ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో వాహనంపై వచ్చిన అడ్డగుట్టకు చెందిన ఆటో డ్రైవర్ నదీమ్‌అలీ ఆమె వెనుకభాగాన్ని అసభ్యంగా తాకి లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీపీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా.. వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.
- మెట్టుగూడకు చెందిన పరుశురామ్ మద్యం సేవించి బస్తీలో హల్‌చల్ చేస్తూ.. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన పోలీసులు అతడిపై సీపీ యాక్టు ద్వారా కేసు నమోదు చేసి, అన్ని ఆధారాలతో కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి రెండ్రోజుల జైలుశిక్ష విధించారు.

12 వేల ఈ – పెటీ కేసులు..

చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండున్నరేళ్లలో సుమారు 12 వేల ఈ – పెటీ కేసులు నమోదు చేయగా.. వంద మందికి పైగా జైలుశిక్ష, మిగిలిన వారికి జరిమానా విధిస్తూ.. న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఒక్కరోజు జైలుశిక్షకు గురైనా ముద్దాయిగానే పరిగణించడంతో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించే అవకాశం కోల్పోతారు. పలు కేసుల్లో నిందితులపై ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు, కోర్టులో వాదోపవాదాలు, బెయిలు, ఛార్జ్‌షీట్, సమయం వృధా అయ్యేదని, అన్ని ఆధారాలు, సాక్ష్యాలతో ఈ – పెటీ కేసులు నమోదు చేయడంతో ఒక్క రోజులోనే నిందితుడికి శిక్ష పడుతుందని పోలీసు అధికారి వివరించారు.





నిజాం కాలం నుంచే..

నిజాం కాలం నుంచే సీపీ యాక్ట్ అమలులో ఉంది. కాగా పట్టణాల్లోని ప్రజల జీవన వ్యవహారశైలి, ఉద్యోగ, ఉపాధి సమయాలు భిన్నమైన రీతిలో ఉంటాయి. నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. సిటీ పోలీస్‌యాక్ట్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. మొత్తం 99 సెక్షన్లను సీపీ యాక్ట్‌లో పొందుపరిచారు. 1959, 1981,1992లతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ చట్టానికి తుది మెరుగులు దిద్దారు.

రోడ్డుపై గొడవ పడితే 70బి..

రోడ్డుపై గొడవ పడితే 70బీ, గొడవపడి కొట్టుకుంటే 70సీ వంటి సెక్షన్‌లతో పాటు ఈవ్ టీజింగ్, అసభ్య ప్రవర్తన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ధూమపానం, సౌండ్ పొల్యూషన్, రహదారులకు అడ్డంగా టెంట్లు వేసి ఫంక్షన్లు చేసుకోవడం, నియమిత వేళల కంటే ఎక్కువ సమయం దుకాణాలు తెరిచి ఉంచడం, ప్రజాజీవనానికి ఆటంకం కలిగించే అన్నిరకాల అంశాలను సీపీ యాక్ట్‌లో పొందుపర్చారు.

ఈ – పెట్టీ కేస్ అంటే...

సీపీ యాక్ట్‌లో భాగంగా పెట్టీ కేసులు నమోదు చేయడం ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ.. నిత్యం జరిగే వ్యవహారం. కొట్లాట, లైంగిక వేధింపులు, పబ్లిక్ న్యూసెన్స్, ఫుట్‌పాత్‌లు, రహదారుల ఆక్రమణ, ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే సందర్భాల్లో సమాచారం లేదా ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్యాబ్ (కంప్యూటర్ విత్ ఫోన్) ద్వారా ఫొటోలు, వీడియోలు తీసుకుంటారు. తేదీ, స్థలం, సమయం, ఇతర సాంకేతిక అంశాలు ఆటోమేటిగ్గా ట్యాబ్‌లో నమోదవుతాయి. నిందితులపై ఈ– పెట్టీ కేసులు నమోదు చేస్తారు. ఆధార్‌కార్డును అనుసంధానం చేసి అన్ని ఆధారాలతో ఆన్‌లైన్‌లో నేరుగా కోర్టుకు అందజేస్తారు. ఒకే వ్యక్తిపై అదే తరహా కేసులు నమోదైతే ఒకటి నుంచి 15 రోజుల వరకు జైలుశిక్ష , నేరాన్ని బట్టి జైలు, జరిమానా రెండూ విధిస్తారు.

చిలకలగూడ ఠాణాలో నమోదు చేసిన పెట్టీ కేసులు..

సంవత్సరం	పెట్టీ కేసులు	జైలుశిక్ష	జరిమానా
2022	7800	60	6710
2023	2749	36	2144
2024 (మే 19 వరకు)	1480	08	800
మొత్తం	12,029	104	9,654

రోజూ 50 ఈ - పెటీ కేసులు..



చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ సుమారు 50 వరకు ఈ – పెట్టీ కేసులు, చలాన్లు వేస్తున్నాం. ప్రజల భద్రతకు సీపీ యాక్టు ఎంతగానో దోహదపడుతోంది. ముషీరాబాద్ పఠాన్‌బస్తీకి చెందిన మహ్మద్ జాకీర్ తరుచూ పబ్లిక్ న్యూసెన్స్ చేస్తుంటే అన్ని ఆధారాలతో కేసు నమోదు చేయగా.. 60 రోజులు జైలుశిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. సీపీ యాక్ట్‌తో పబ్లిక్ న్యూసెన్స్ కేసులు నియంత్రణలోకి వచ్చాయి. ప్రజలు, పోలీసులు పరస్పరం సహకరించుకుని ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కొత్త నిర్వచనం ఇవ్వాలి. – జైపాల్‌రెడ్డి, ఏసీపీ, చిలకలగూడ డివిజన్

సీపీ యాక్ట్‌తో చిల్లర కేసులు తగ్గాయి..



సీపీ యాక్ట్‌తో చిల్లర కేసులు చాలా వరకు తగ్గాయి. సీపీ యాక్ట్‌లోని 70, 71ఏ, బీ, సీ సెక్షన్లను విరివిగా వినియోగించి బాధితులకు న్యాయం చేకూర్చుతున్నాం. ఒక్కరోజు జైలుశిక్షకు గురైనా పోలీస్ రికార్డుల్లో ముద్దాయిగానే నమోదవుతుంది. ఇది ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాలకు ఆటంకం అవుతోంది. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సరైన మార్గంలో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. – అనుదీప్, ఎస్‌హెచ్‌ఓ, చిలకలగూడ పోలీస్‌స్టేషన్

మల్టీస్కిల్స్ ఉంటే రాణించవచ్చు



అలిశెట్టి ప్రభాకర్ కవితా పుస్తకాలతో బాపయ్యచౌదరి, రవి, కిషోర్‌రెడ్డి, వీరయ్య, కోయ చంద్రమోహన్, బాలకాశి

చిక్కడపల్లి: మల్టీస్కిల్స్ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నాట్స్ సహకారంతో తెలంగాణ బుక్ ట్రస్ట్, అవని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణకేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీ లేకుండా ఏ రంగం అభివృద్ధి కాదన్నారు. విద్యార్థులు బేసిక్స్, ఇతర భాషలపై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం నిర్వాహకులు బాపయ్యచౌదరికి అలిశెట్టి ప్రభాకర్ కవితల పుస్తకాన్ని ప్రదానం చేశారు. రవి తాండ్ర, ప్రొఫెసర్ కిషోర్‌రెడ్డి, కొండూరు వీరయ్య, కోయ చంద్రమోహన్, బాలకాశి పాల్గొన్నారు.